ఓపీ సేవల్లో దుబ్బాక ఆసుపత్రికి మొదటిస్థానం

దుబ్బాక, మే 8 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక ప్రాంతీయ ఆసుపత్రి ఆన్‌లైన్ ఓపీ సేవలను అందించడంలో రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిచిందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్‌సింగ్ తెలిపారు. గురువారం దుబ్బాకలో ఆయన మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చిన రోగుల ఓపీ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం,డాక్టర్ రాసిన మందుల చీటిని అప్‌లోడ్ చేసినందుకుగాను రాష్ట్రంలోనే మొదటిస్థానం నిలిచిందని తెలిపారు.

దేశ సమైక్యతకు భంగం కలిగిస్తే సహించం

● ఎంపీ రఘునందన్‌రావు

సిద్దిపేట కల్చరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : దేశ సమైక్యతకు, సైనికుల ఆత్మస్థైర్యానికి భంగం కలిగేలా ప్రవర్తిస్తే సహించేది లేదని ఎంపీ రఘునందన్‌రావు స్పష్టం చేశారు. సిద్దిపేటలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫ్రీడమ్ ఆఫ్ స్పీచ్ పేరిట సైన్యం చేస్తున్న పోరాటానికి భంగం కలిగేలా వ్యాఖ్యలు చేసినా వార్తలు ప్రచురించినా, సోషల్ మీడియాలో పోస్టు చేసినా సహించేది లేదని స్పష్టం చేశారు. యుద్ధ సమయంలో రాజకీయాలను పక్కన పెట్టి ఐక్యత చూపించాల్సిన సమయంలో సైనికుల ధీరత్వాన్ని తక్కువ చేసి చూపించడం సరికాదన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, బీజేపీ నాయకులు బాసంగారి వెంకట్, కాసనగొట్టు సంతోష్, కొత్తపల్లి వేణుగోపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

ఆ ఘనత మోదీకే దక్కుతుంది

భారతీయ సంస్కృతిలో భాగమైన యోగాను ఎందరో ఋషులు రూపొందించారని ప్రపంచానికి యోగాను పరిచయం చేసిన ఘనత ప్రధానమంత్రి మోదీకి దక్కుతుందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు చెప్పారు. సిద్దిపేట వ్యాస మహర్షి యోగ సెంటర్లో గురువారం జరిగిన ఉచిత మహిళా యోగశిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడుతూ మోడీ జీవన విధానమే ఆదర్శమని చెప్పారు. మోడీ వల్ల ఇస్లామిక్ దేశాల్లో కూడా యోగాను జీవితంలో భాగం చేసుకుంటున్న విషయం మనకు గర్వకారణం అని అన్నారు. ఉరుకుల పరుగుల జీవితంలో సెల్‌ఫోన్‌లు, టీవీలు ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యోగా అధ్యయన పరిషత్ సభ్యులు, యోగా శిక్షకులు తోట సతీష్, తోట సంధ్య, వ్యాస మహర్షి యోగ సొసైటీ అధ్యక్షుడు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, అంజయ్య, తోట అశోక్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రహదారులకు రూ.90 కోట్ల నిధులు మంజూరు

మున్సిపల్, ఆర్అండ్‌బీ, పీఆర్, హెచ్ఎండీఏ అధికారులతో జగ్గారెడ్డి సమీక్షా సమావేశం

సంగారెడ్డి టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని ఐబీ గెస్ట్ హౌస్‌లో మున్సిపల్, పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ అధికారులతో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల గురించి అధికారులతో చర్చించారు.



అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న జగ్గారెడ్డి

ఆర్అండ్‌బీ శాఖ

●కొండాపూర్ మండలం మల్లేపల్లి నుంచి వయా, గోపులారం చెరువు కట్ట వెడల్పు, తేర్పోల్, హరిదాస్‌పూర్ వరకు ఏడు కిలోమీటర్లు మేర రోడ్డును డబుల్ లేన్‌గా మార్చడం కోసం రూ.15 కోట్లు మంజూరు. పనులకు త్వరలో శంకుస్థాపన.

● సదాశివపేట మండలం తంగేడుపల్లి- మల్లారెడ్డి పెట్ రోడ్డు, వయా మద్దుకుంట గ్రామం, ఆత్మకూర్ వరకు 8 కిలోమీటర్లు మేర డబుల్ లేన్‌గా మారుస్తూ రోడ్డు వెడల్పు కోసం రూ.15 కోట్లు మంజూరు.

పంచాయతీ రాజ్ విభాగం

●కొండాపూర్ మండలం పీడబ్ల్యూడీ రోడ్డు కొండాపూర్ నుంచి వయా అలియాబాద్, గ్యారకుర్తి గ్రామాల నుంచి సదాశివపేట వరకు 9 కిలోమీటర్ల మేర రోడ్ నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు.

●కంది మండలం కలివేముల గ్రామం నుంచి మక్త అల్లూరు గ్రామం వరకు రెండు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ. 1.80 కోట్లు మంజూరు.

●కంది మండలం చిమ్నాపూర్ నుంచి చిమ్నాపూర్ తండా వరకు ఒక కిలోమీటర్ మేర రోడ్డు నిర్మాణానికి రూ. 1.34 కోట్లు మంజూరు.

●సంగారెడ్డి బైపాస్ రోడ్డు నుంచి మహమ్మద్ షాపూర్ తండా వరకు 2 కిలోమీటర్ల రోడ్డుకు రూ.1.85 కోట్లు మంజూరు.

●కొండాపూర్ మండలం మారేపల్లి పీడబ్ల్యూడీ రోడ్డు.. వయా రామ్‌పూర్ తండా, గోటిలగుట్ట తండా మాచేపల్లి నుంచి సీతారాంకుంట వరకు 3.8 కిలో మీటర్ల మేర రోడ్డు మరమ్మతు కోసం రూ.2.65 కోట్లు మంజూరు.

●సదాశివపేట మండలం ఆత్మకూరు నుంచి వయా బొబ్బిలిగామ, ఏటిగడ్డ సంగం, మలాపాడ్ గ్రామాల మీదుగా సింగూర్ ప్రాజెక్ట్ వరకు 7.5 కిలోమీటర్ల రోడ్డు మరమ్మతుల కోసం రూ. 5.2 కోట్లు మంజూరు.

హెచ్ఎండీఏ

● సంగారెడ్డిటౌన్ ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి బైపాస్ రోడ్ మీదుగా బస్వేశ్వర విగ్రహం వరకు 2.6 కిలోమీటర్ల మేర రోడ్డు ఫోర్ లేన్‌గా విస్తరణ, నాలుగు జంక్షన్‌ల అభివృద్ధి కోసం రూ.12 కోట్లు మంజూరు.

● నేషనల్ హైవే 65 నుంచి రైతువేదిక, శిల్పా వెంచర్ వెనుక నుంచి భూలక్ష్మమ్మ ఆలయం వరకు అరవై పీట్ల రోడ్డుకు రూ. 4.5 కోట్లు మంజూరు.

● సంగారెడ్డి పట్టణంలోని రాజీవ్ పార్కు అభివృద్ధికి రూ, 12 కోట్లు మంజూరు.

సరిహద్దుల్లో మనోళ్లు

సిందూర్‌లో కీలకం

బార్డర్‌లో సైనికులుగా.. భారత్‌కు రక్షకులుగా విధులు నిర్వహిస్తున్న లక్షలాది మంది జవాన్లలో ఉమ్మడి మెదక్ జిల్లావాసులు సైతం ఉండడం మనకు గర్వకారణం. తాజాగా జరిగిన ఆపరేషన్ సిందూర్‌లోనూ మెరికల్లాంటి మెతుకుసీమ ఆణిముత్యాలు కీలకంగా ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఎలాంటి ప్రతికూల పరిస్థితులనైనా తట్టుకుంటూనే.. యుద్ధం ఎప్పుడొచ్చినా ఎదుర్కొంటామంటూ దేశభక్తిని చాటుతున్నారు. ఇక దేశ సరిహద్దుల్లో సుదీర్ఘకాలం సేవలందించి రిటైర్ అయిన సైనికులు సైతం మళ్లీ పిలుపునిస్తే సిద్ధంగా ఉన్నామంటున్నారు.

యుద్ధానికి సిద్ధమేనంటున్న మెతుకుసీమ మెరికలు

త్రివిధ దళాల్లో వందల సంఖ్యలో ఉమ్మడి జిల్లా వాసులు

ఒక్క కట్కూరు గ్రామంలోనే 120 మంది సైనికులు

తమకూ పిలుపొస్తే వెళ్తామంటున్న మాజీ జవాన్లు



కశ్మీర్ బార్డర్‌లో పనిచేస్తున్న ఎల్లుపల్లి వాసి ముస్త్యాల అజయ్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మే 8: దేశానికి సేవ చేసే భాగ్యం అందరికీ రాదు. సరిహద్దుల్లో రక్షణ బాధ్యతలు చూస్తున్నవారిలో ఉమ్మడి మెదక్ జిల్లావాసులు వందల సంఖ్యలోనే ఉన్నారు. భారతదేశ సరిహద్దులతోపాటు వివిధ రాష్ట్రాల్లో ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నౌకాదళ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఎక్కువమంది సైనిక దళంలో పనిచేస్తున్నారు. ఇటీవల జరిగిన ఆపరేషన్ సిందూర్‌లోనూ అక్కన్నపేట మండలం కట్కూరుకు చెందిన సైనికులు భాగస్వాములయ్యారు. యుద్ధ మేఘాలు కమ్ముకున్న జమ్మూ, కశ్మీర్, పంజాబ్ బార్డర్లలోనూ మనవాళ్లున్నారు.

సైనికుల ఊరు.. కట్కూరు

సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కట్కూరు గ్రామం నుంచే 120 మంది సైనికులు దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పదో తరగతి పాసయ్యారంటే చాలు తమ అడుగులు

మిగతా 7వ పేజీలో



సైన్యంలో ఉన్న కట్కూరు గ్రామస్థులు

మాతృభూమి సేవకు సిద్ధం

ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు సైనికులు ప్రస్తుతం బార్డర్లలో విధులు నిర్వహిస్తున్నారు. యుద్ధానికి సిద్ధంగా ఉన్నామంటూ సవాల్ చేస్తున్నారు.

● గజ్వేల్ మండలం బంగ్లా వెంకటాపూర్‌కు చెందిన హర్షవర్ధన్ పంజాబ్ రాష్ట్రంలో పాకిస్తాన్‌తో సరిహదుద్దలో విధులు నిర్వహిస్తున్నారు.

● ఝరాసంగం మండలం బర్దీపూర్‌కు చెందిన ప్రశాంత్ దేశసరిహద్దు అమృత్‌సర్‌లో ఏయిర్‌గన్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. యుద్ధానికి సిద్ధంగా ఉన్నారు.

● రాయపోల్ మండలం మంతూరుకు చెందిన పడిగె నందీశ్వర్ జమ్మూ కాశ్మీర్‌లోని బారాముల్లా సెక్టార్‌లో పనిచేస్తున్నారు.

● సిద్దిపేట అర్బన్ మండలం ఎల్లుపల్లికి చెందిన ముస్త్యాల అజయ్ ఏడాదిన్నర క్రితమే ఆర్మీలో చేరాడు. ప్రస్తుతం కాశ్మీర్ బార్డర్‌లోనే విధుల్లో ఉన్నారు.

● అక్కన్నపేట మండలం కట్కూరుకు చెందిన బొల్లి శ్రీకాంత్, పంజా అమరేందర్‌లు ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొనడమే గాకుండా.. మళ్లీ సిద్ధంగా ఉన్నారు.

● కొడిపల్లి మండలం పాంపల్లికి చెందిన ప్రసాద్ పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ బార్డర్ పాకిస్థాన్ సరిహద్దు సమీపంలో విధులు నిర్వహిస్తున్నారు.

కార్గిల్ యుద్ధంలో పాల్గొన్నాను



మాది మెదక్ జిల్లా నిజాంపేట మండలం తిప్పనగుల్ల. 1997లో సిపాయిగా చేరి 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో పాల్గొన్నా. అప్పుడు ఎడమ కాలుకు బుల్లెట్ తగిలింది. దాదాపు 20 సంవత్సరాలు వివిధ హోదాల్లో పదోన్నతులు పొందుతూ ఆర్మీలో పనిచేశాను. 2017లో ఉద్యోగ విరమణ తీసుకొని ప్రస్తుతం చేగుంట మండలం గొల్లపల్లి జత్రం తండా గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాను. యుద్ధానికి పిలుపు వస్తే వెళ్లడానికి సిద్ధం.

-సిద్ది పేట ఎల్లం, రిటైర్డ్ హవల్దార్ మేజర్

ఎప్పుడు పిలిచినా వెళ్తా



పద్దెనిమిదేళ్ల వయసులో ఆర్మీలో చేరాను. 1999 కార్గిల్ యుద్ధ సమయంలోనూ క్లిష్ట పరిస్థితుల్లో విధులు నిర్వహించాను. ఏడేళ్ల పాటు కశ్మీర్ బార్డర్‌లో పనిచేశాను. యుద్ధమంటూ వస్తే సైన్యానికి సహకారం అవసరముందని పిలుపువస్తే ఏ క్షణాన్నైనా బయల్దేరడానికి సిద్ధంగా ఉన్నాను. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి. పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు గట్టిగా బుద్ధిచెప్పాలి.

-సంగమేశ్వర్, రిటైర్డ్ జవాన్, చేవెళ్ల (అల్లాదుర్గం)

ప్రజలు ఆందోళన చెందొద్దు

● రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి) : పాకిస్థాన్‌తో యుద్ధం వల్ల తెలంగాణ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ తరువాత పాకిస్థాన్ పశ్చాతాప పడకుండా కవ్వింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. భారత ప్రభుత్వం సరైన విధంగా వ్యవహరించి జరిపిన దాడులకు, ఆ పాత్ర పోషించిన త్రివిధ దళాలకు శుభాకాంక్షలు తెలిపారు. సున్నితమైన అంశాన్ని దుష్ప్రచారం చేస్తే చర్యలుంటాయని హెచ్చరించారు. హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా హైదరాబాద్‌కు సంబంధించి పోలీసు, రెవెన్యూ అధికారులను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటున్నామన్నారు. సైనికులు ఉండే కంటోన్మెంట్ ఏరియాలున్నాయని, వారికి అండగా ఉంటూ ప్రజలందరూ సహకరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.



ఆయిల్‌ఫెడ్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం

● అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

సిద్దిపేట కలెక్టరేట్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగు లాభదాయకమని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ పేర్కొన్నారు. ఈ ఏడాది జిల్లా టార్గెట్‌ను తప్పకుండా చేరుకునేలా అన్ని రైతువేదికల్లో రైతులతో సమావేశాలు నిర్వహించి వారిని ప్రేరేపించాలని అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లాలోని ఆయిల్‌ఫెడ్, ఉద్యానవన, వ్యవసాయశాఖ అధికారులతో అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సువర్ణ మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు 12,339 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగవుతుందని, అలాగే 2025-26 సంవత్సరానికి గాను 6,500 ఎకరాల లక్ష్యం పెట్టుకొని ఇప్పటివరకు 665 ఎకరాలు 188 మంది రైతులను గుర్తించినట్లు చెప్పారు. జిల్లాలో 209 మంది రైతుల నుంచి 492 టన్నుల గెలలు కటింగ్ చేసి ఖమ్మం జిల్లా అశ్వారావుపేటలో ఉన్న ఫ్యాక్టరీలకు పంపినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని జిల్లాకు ఇచ్చిన 6,500 ఎకరాల లక్ష్యాన్ని తప్పనిసరిగా పూర్తి చేయాలని తెలిపారు. అలాగే రూ. 300 కోట్లతో నిర్మాణం చేపడుతున్న ఆయిల్‌పామ్ కర్మాగారం సైతం జూన్‌లోపు పూర్తవుతుందని చెప్పారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వం ఉద్యానవనశాఖ జారీ చేసిన ఆయిల్ పామ్ సాగు కరపత్రాలను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా ఆయిల్ ఫెడ్ అధికారి భాస్కర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి రాధిక, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

మెప్మాలో ఆగని అలజడి

● ఏడు గ్రూప్ సభ్యులకు చెందిన నిధులు పక్కదారి? ● ఆర్పీపై కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన సభ్యులు

● సీవోకు డబ్బులిచ్చామంటూ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన ఆర్పీ ● నిధుల పక్కదారిలో బ్యాంక్ అధికారుల పాత్ర?

గజ్వేల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని మెప్మా విభాగంలో ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. నిత్యం ఏదో ఒక గ్రూపునకు సంబంధించిన సభ్యులు తమ పేరు మీద రుణాలు తీసుకుని వాడుకున్నారంటూ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్నారు. ఇప్పటికే ఏడు మహిళా సంఘాలకు చెందిన గ్రూప్ సభ్యులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్పీ కృష్ణలీల తమ పేరుపై రుణాలు తీసుకుని వాడుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఆర్పీ ఎనగుర్తి కృష్ణలీల తాను సదరు డబ్బును వాడుకోలేదని, గతంలో పనిచేసిన సీవోకు ఆ నిధులను ఇచ్చానంటూ ఫిర్యాదుతో పాటు అందుకు సంబంధించిన ఆధారాలను మున్సిపల్ కార్యాలయంలో అందజేశారు. ఇన్నాళ్లు ఆర్పీ పైనే ఉన్న అనుమానం కాస్త ఇప్పుడు సీవోపై, బ్యాంక్ అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు రూ.కోటి నిధులు పక్కదారి పట్టిన ట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బ్యాంక్ అధికారుల పాత్ర లేకుండా ఇంత పెద్ద మొత్తంలో నిధుల మళ్లింపు సాధ్యం కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. నిధుల రికవరీ, తమ పేర్లపై ఉన్న లోన్లపై బాధితులు లోలోపల ఆందోళన చెందుతున్నారు.

రూ.కోటి పక్కదారి

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మెప్మా గ్రూపుల్లో దాదాపు రూ.కోటి రుణాలు పక్కదారి పట్టినట్లు తెలుస్తుంది. మొత్తం ఏడు గ్రూపులకు చెందిన డబ్బులు సభ్యులకు తెలియకుండా వారి పేరుపై రుణాలు తీసి వినియోగించినట్లు తెలుస్తోంది. మెప్మా పరిధిలోని శివశంకర్ గ్రూప్, నెహ్రూ గ్రూప్, లీలశ్రీ గ్రూప్, బాలాజీ గ్రూప్, మానస గ్రూప్, చైతన్య గ్రూప్, లక్ష్మిబాలాజీ గ్రూపులకు చెందిన నిధులు పక్కదారి పట్టినట్లు సమాచారం. ఆర్పీ కృష్ణలీల తన ఫిర్యాదులో రూ. 67 లక్షలు సీవోకు ఇచ్చినట్లుగా చెబుతున్నప్పటికీ ఈ మొత్తం రూ.కోటి పైననే ఉంటుందని సమాచారం.



ఫైల్

బ్యాంక్ అధికారుల పాత్ర...?

మెప్మా గ్రూపులకు సంబంధించిన నిధులు పక్కదారులు పట్టడంలో బ్యాంక్ అధికారుల పాత్ర ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వెయ్యి రూపాయలు కావాలన్నా తప్పనిసరిగా సదరు ఖాతాదారు బ్యాంకుకు రావాలనే నిబంధనను చూపెట్టే అధికారులు లక్షల రూపాయల డబ్బులు మెప్మా సభ్యులు లేకుండా ఎలా పక్కదారి పట్టించారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రముఖంగా గజ్వేల్ పట్టణంలోని రెండు బ్యాంకులోని ఫీల్డ్ ఆఫీసర్ల పాత్ర ఈ నిధుల పక్కదారిలో ఉన్నట్లు పలువురు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. బ్యాంక్ అధికారుల పాత్రలేనిది నిధులు పక్కదారి పట్టడం సాధ్యం కాదని చెబుతున్నారు.

ఆందోళనలో బాధితులు

నిధుల రికవరీపై బాధితులు ఆందోళన చెందుతున్నారు. తమ ప్రమేయం లేకుండా తమ పేర్లపై తీసుకున్న రుణాలకు సంబంధించిన నిధులు ఎవరు చెల్లిస్తారోనని, ఎలా చెల్లిస్తారోనని, వారు చెల్లించని పక్షంలో తమ పరిస్థితి ఏంటోనని పలువురు బాధితులు ఆందోళన చెందుతున్నారు. కూలీ...నాలీ... చేసుకునే తాము లక్షల రూపాయల రుణాలను ఎలా చెల్లించాలని మదనపడుతున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని తాము లక్షల రూపాయల రుణాలను కట్టాలంటే కట్టలేమని, తమకు ఆత్మహత్యలే శరణ్యమని పలువురు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఇదిలా ఉండగా నిధుల రికవరీపై ఉన్నత అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

కాస్త ఉపశమనం

● నాలుగు రోజులుగా తగ్గిన ఉష్ణోగ్రతలు

● జిల్లా వ్యాప్తంగా ఎల్లో అలర్ట్ జారీ చేసిన అధికారులు

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, మే 8: గత నెలరోజుల నుంచి జిల్లాలో ఎండలు దంచికొట్టాయి. జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందులకు గురయ్యారు. చేర్యాల మార్కెట్ యార్డులో ఓ రైతు వడదెబ్బకు మృతిచెందాడు. ఇక అక్కడక్కడ పలువురు ఎండవేడికి అస్వస్థతకు గురయ్యారు. వాతావరణంలో మార్పు కారణంగా జిల్లాలో రెండు, మూడు రోజుల క్రితం ఉదయం ఎండ, సాయం త్రం ఈదురుగాలులతో భారీ వర్షాలు కురవడంతో విభిన్న వాతావరణ పరిస్థితులు ఏర్పడ్డాయి. మూడు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు 39 డిగ్రీలకు తగ్గుముఖం పట్టింది. వాతావరణశాఖ అధికారులు సిద్దిపేట జిల్లాను ఎల్లో అలర్ట్‌గా జారీ చేశారు.



ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన సిద్దిపేట పాత బస్టాండ్ చౌరస్తా (ఫైల్)

నాలుగు రకాలుగా హెచ్చరికలు

ఎండాకాలంలో ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకుని వాతావరణశాఖ అధికారులు నాలుగురకాలుగా హెచ్చరికలను విభజించారు. గ్రీన్, ఎల్లో, ఆరెంజ్, రెడ్ ఈ నాలుగు రకాలు ప్రజలను అప్రమత్తం చేసేలా నిర్ణయించారు. గ్రీన్ అలర్ట్ 35 డిగ్రీల లోపు ఉంటే ఎలాంటి హెచ్చరిక లేదని, ఎల్లో అలర్ట్ 35 నుంచి 40 డిగ్రీల లోపు ఉంటే జాగ్రత్తగా ఉండాలని, ఆరెంజ్ 40 నుంచి 45 డిగ్రీల లోపు ఉంటే ప్రమాద స్థాయి ఉన్నట్లుగా, రెడ్ అలర్ట్ 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు దాటితే అతి ప్రమాదకరమైన హెచ్చరికగా జారీ చేయనున్నారు. గత నెల ఏప్రిల్‌లో 44.5 డిగ్రీలకు చేరుకోగా అధికారులు ఆరెంజ్ అలర్ట్‌ను జారీచేశారు.

తగ్గిన ఉష్ణోగ్రతలు

ఫిబ్రవరి నుంచి ప్రారంభమైన ఎండలు దాదాపుగా 40 డిగ్రీలకు, ఏప్రిల్ చివరి వారంలో 44.5 డిగ్రీలకు చేరాయి. మూడు రోజుల క్రితం ఎండలు తగ్గడంతో జిల్లావ్యాప్తంగా ఎల్లో అలర్ట్‌ను అధికారులు జారీచేశారు.

గురువారం జిల్లాలోని చేర్యాలలో 39.4 డిగ్రీలు, మర్కుక్‌లో 39.0 డిగ్రీలు, సిద్దిపేట రూరల్‌లో 38.9, సిద్దిపేట అర్బన్, అక్బర్‌పేట-భూంపల్లిలో 38.6, కోహెడలో 38.3, బెజ్జంకి, అక్కన్నపేటలో 38.2, మద్దూర్‌లో 38.1, దుబ్బాక, చిన్నకోడూర్‌లో 38.0, హుస్నాబాద్‌లో 37.9, జగదేవ్‌పూర్, దౌల్తాబాద్, రాయపోల్‌లో 37.8, కుకునూర్‌పల్లిలో 37.7, నారాయణరావుపేటలో 37.6, తొగుటలో 37.5, నంగునూర్‌లో 37.2, దూళిమిట్టలో 37.1, కొమురవెల్లిలో 37.0, గజ్వేల్‌లో 36.8, కొండపాక 36.7, ములుగులో 36.2, వర్గల్‌లో 36.1 డిగ్రీలు, మిరుదొడ్డిలో 35.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



సిద్దిపేటలో మబ్బులు కమ్మేయడంతో చీకటిమయంగా మారిన రంగనాయకసాగర్

కాల్చితే.. నష్టమే..!

● వరి కొయ్యల కాల్చివేతతో అనర్థాలు 8

మామిడి రైతు కుదేలు

● గణనీయంగా పడిపోయిన దిగుబడి 7

రెండు బైకులు ఢీ కొని వ్యక్తి మృతి

నారాయణఖేడ్, మే 8 (ఆంధ్రజ్యోతి): ముందు వెళ్తున్న బైకును వెనుక నుంచి వచ్చిన మరో బైక్ ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందగా, ముగ్గురు గాయపడ్డారు. ఈ సంఘటన గురువారం మండల పరిధిలోని నాగాపూర్ వద్ద చోటు చేసుకుంది. ఖేడ్ ఎస్సై విద్యాచరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. సిర్గాపూర్ మండలం ఖాజాపూర్‌కు చెందిన సురేష్, ఖేడ్ మండలం అబ్బెంద క్లస్టర్ ఏఈవోగా విధులు నిర్వహిస్తున్నాడు. సురేష్ గురువారం నాగాపూర్ నుంచి బైక్‌పై నాగాపూర్ తండాకు చెందిన బిక్యానాయక్ కలిసి ఖేడ్‌కు వెళ్తున్నారు. సీతారాం తండాకు చెందిన కాశీరాం తన కుమారుడు చందుతో కలిసి బైక్ పై, ఖేడ్ వైపు వస్తున్నారు. నాగాపూర్ దాటాక సురేష్ బైక్‌ను, కాశీరాం బైక్ వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఖేడ్ ఏరియా ఆసుపత్రికి తీసుకురాగా, బిక్యానాయక్(65) అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడ్డ ముగ్గురిని మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డికి తరలించారు. అందులో కాశీరాం పరిస్థితి విషమంగా ఉందన్నారు.

లిఫ్ట్ అడిగి ప్రాణాలు కోల్పోయిన బిక్యానాయక్

నాగాపూర్ నుంచి బైక్‌పై ఖేడ్‌కు వస్తున్న ఏఈవో సురేష్‌ను బిక్యానాయక్ లిఫ్ట్ అడిగి అతడి వెనుక కూర్చొని వస్తున్న క్రమంలో బిక్యానాయక్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు.

బైక్ అదుపు తప్పి ఒకరి మృతి

పుల్‌కల్, మే 8 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం శివంపేట గ్రామ శివారులో గురువారం సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పుల్కల్ ఎస్సై పాటిల్ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం..అందోలు మండలం డాకూరు గ్రామానికి చెందిన పీర్ల సుధాకర్ (60) జోగిపేట నుంచి సంగారెడ్డికి టీఎస్15ఎఫ్‌క్యూ 2338 నంబరు గల మోటారు బైక్‌పై ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో మోటారు బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న మెటల్ బీమ్ బారియర్‌ను వేగంగా ఢీకొట్టి కింద పడిపోయారు. దీంతో సుధాకర్ తలకు బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ఎస్సై పాటిల్ క్రాంతికుమార్ చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి గల్లంతు

● కొనసాగుతున్న గాలింపు చర్యలు

మాసాయిపేట, మే 8(ఆంధ్రజ్యోతి): మాసాయిపేట మండలం కొప్పులపల్లి గ్రామం వద్ద గల హల్దీ ప్రాజెక్టు డ్యాంలో చేపల వేటకు వెళ్లి ఓ యువకుడు గల్లంతయ్యాడు. వెల్దుర్తి మండలం చర్లపల్లి వర్ధమాన్ తాండకు చెందిన కీతావత్ గోపాల్ (32) అనే యువకుడు తన మిత్రుడైన రాజు అనే యువకుడితో కలిసి గురువారం సాయంత్రం చేపల వేటకు వెళ్లాడు. చేపలు పట్టే క్రమంలో గోపాల్ కాళ్లు జారి నీటిలో పడిపోయి గల్లంతయినట్లు గ్రామస్థులు తెలిపారు. గోపాల్ కోసం వెల్దుర్తి పోలీసులు అగ్నిమాపక ఫైర్ సిబ్బంది కలిసి గురువారం రాత్రి వరకు గాలింపులు చేపట్టారు. గాలింపు చర్యలు గురువారం రాత్రి వరకు కొనసాగుతూనే ఉన్నాయి ఈ సంఘటనపై వెల్దుర్తి పోలీసులు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని అన్నారు.

ముత్తంగి జంక్షన్ వద్ద 106 కిలోల గంజాయి పట్టివేత



గంజాయిని తరలిస్తున్న ముఠాను అరెస్ట్ చేసిన సీసీఎస్, పోలీసులు

పటాన్‌చెరు, మే 8(ఆంధ్రజ్యోతి): విజయవాడ నుంచి మహారాష్ట్రకు భారీగా గంజాయిని తీసుకెళ్తున్న ఘరానా ముఠాను సీసీఎస్, పటాన్‌చెరు పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో పట్టుకున్నారు. గురువారం ఉదయం ముత్తంగి ఔటర్ రింగ్ రోడ్డు జంక్షన్ వద్ద మాటువేసిన పోలీసులు గంజాయిని తీసుకెళ్తున్న రెండు కార్లను తనిఖీ చేశారు. ఆ కార్ల డిక్కీలలో తరలిస్తున్న 106కిలోల ఎండు గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు ఇన్‌స్పెక్టర్ వినాయక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్ మండలం, ఎన్కపల్లి గ్రామం పత్తుతండాకు చెందిన రాథోడ్‌బీర్బల్, రాథోడ్‌సురేష్, రాథోడ్‌ప్రకాష్, రాథోడ్ మారుతీ అనే వ్యక్తులు ముఠాగా ఏర్పడి విజయవాడ నుంచి గంజాయిని కొనుగోలు చేసి అధిక ధరకు మహారాష్ట్రలో విక్రయించేందుకు రెండు కార్లలో బయలుదేరారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ 26.70లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు రెండు వాహనాలను సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ వినాయక్‌రెడ్డి తెలిపారు.

చెరువులో పడి యువకుడు మృతి

కౌడిపల్లి, మే8 (ఆంధ్రజ్యోతి): అనుమానస్పద స్థితిలో చెరువులో పడి ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన మండల పరిధిలోని మహ్మద్‌నగర్‌లో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చాకలి శేకులు (37) గురువారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్ళిపోయి కన్నారం పెద్ద చెరువులో పడి మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. పోలిసులు గాలింపు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో పోలీసులకు గాయాలు



గాయపడ్డ ఎస్సై శ్రీరాములు

కుకునూరుపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): ఓ రోడ్డు ప్రమాదంలో పోలీసులకు గాయాయ్యాయి. ఈ సంఘటన కుకునూరుపల్లిలో జరిగింది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో షీటీం విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న శ్రీరాములు, కానిస్టేబుల్ లావణ్య కునూరుపల్లిలో అవగాహన కార్యక్రమం నిర్వహించిన అనంతరం తిరిగి గజ్వేల్‌కి మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా వెనకాల నుంచి అతివేగంగా వచ్చిన ఓ కారు మోటార్ సైకిల్‌ని ఢీకొట్టింది. దీంతో శ్రీరాములు, లావణ్యకి తీవ్రమైన గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

● కంకోల్ టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ

మునిపల్లి, మే8 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా సంగారెడ్డి నుంచి బీదర్‌కు ఇసుకను తరలిస్తున్న లారీని కంకోల్ టోల్ ప్లాజా వద్ద మునిపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి మునిపల్లి ఎస్సై రాజేష్ నాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి నుంచి బీదర్‌కు అక్రమంగా తరలిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు గురువారం నాడు మునిపల్లి పోలీసులు మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఓ లారీపై అనుమానం రావడంతో ఆపి తనిఖీ చేయగా ఇసుకకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేవని గుర్తించడంతో లారీని సీజ్ చేసి మునిపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా సంగారెడ్డి నుంచి తీసుకవచ్చిన ఇసుకను బీదర్‌లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు టిప్పర్ డ్రైవర్ సయ్యద్ మసియుద్దీన్, లారీ యజమాని మహ్మద్ ఇమ్రాన్‌లు ఒప్పుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు టిప్పర్ డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేష్ నాయక్ తెలిపారు.

బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

నర్సాపూర్, మే 8 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ బస్టాండ్‌లో రెండురోజుల క్రితం రాత్రి సమయంలో ఓ వ్యక్తి స్పృహ కోల్పోయి పడి ఉండగా అతడిని ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఎస్సై లింగం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం బస్టాండులో ఈ నెల 6వ తేదీన 45-50 ఏళ్ల వయస్సుతో ఉన్న ఓ వ్యక్తి రాత్రి 8 గంటల ప్రాంతంలో స్పృహ కోల్పోయి ఉండగా స్థానిక కంట్రోలర్ సత్యనారయణ అంబులెన్సుకు సమాచారమిచ్చి ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం చనిపోయినట్లు చెప్పారు. అయితే గుర్తు తెలియని వ్యక్తి కావడంతో అతడి మృతదేహం స్థానిక మార్చురిలో ఉంచుతామని ఎవరైనా అనుమానం ఉంటే స్థానిక పోలీసులను సంప్రదించాలని ఎస్సై సూచించారు. అయితే చనిపోయిన వ్యక్తి కుడిచేతిపై అనిత అని పచ్చబొట్టు ఉందని చెప్పారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య

హవేళిఘణపూర్, మే8 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం మండలంలోని శాలిపేట గ్రామానికి చెందిన పల్ల యాదగిరి-సావిత్రి దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. మొదటి కుమారుడు పల్ల మనోహర్(23) కిరాణషాపు నడుపుతుండేవాడు. షాపు సరిగ్గా నడవకపోవడంతో నష్టాలు రావడం వల్ల అప్పులు అయ్యాయి. అప్పులు ఎలా తీర్చాలోనని మనస్తాపానికి గురై పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. చికిత్స కోసం మెదక్ ఆసుపత్రికి తరిలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరిలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. మృతుడి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వెల్దుర్తి, మే 8 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అందుగులపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వెల్దుర్తి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అందుగులపల్లి గ్రామానికి చెందిన దున్న శేఖగౌడ్ (61) ఈనెల 7న ఉదయం ఇంట్లో స్పృహ తప్పి ఒక్కసారి కుప్ప కూలిపోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం శేఖగౌడ్ మృతి చెందాడు. మృతుడి తమ్ముడు మల్లేష్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

పుల్‌కల్, మే 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం చౌటకూర్‌లో బుధవారం రాత్రి గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమయింది. పుల్కల్ ఎస్సై పాటిల్ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. 65 నుంచి 70 ఏళ్ల వయస్సు గల వృద్ధుడు నాయిని చెరువుకు వెళ్లే రహదారి పక్కన చెట్టు కింద మృతి చెందాడు. ఎండ వేడిని తట్టుకోలేక చెట్టు కిందనే నిద్రపోతూ మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పాటిల్ క్రాంతికుమార్ తెలిపారు.

సింగూరు ప్రాజెక్టులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

పుల్‌కల్, మే 8 (ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టు నీటిలో గల్లంతైన ఓ వ్యక్తి మృత దేహం గురువారం రాత్రి లభ్యమయింది. పుల్కల్ ఎస్సై పాటిల్ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం కొండాపూర్ మండలం కిష్టయ్యగూడెం గ్రామానికి చెందిన దుర్గయ్య (39) ఈ నెల 4వ తేదీన సింగూరులో బంధువుల ఇంట్లో జరిగిన దినకర్మ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చాడు. రెండు రోజుల క్రితం స్థానిక నీటి పారుదల శాఖ అతిథిగృహం వెనుకవైపున గల క్వారీల్లోకి కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి నీళ్లలో పడి గల్లంతయ్యాడు. ఆచూకీ కోసం ఎంత వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. గురువారం రాత్రి పొద్దుపోయాక అతిథిగృహం వెనుకవైపున గల క్వారీల్లోని నీటిలో శవమై కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై పాటిల్ క్రాంతికుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



జహీరాబాద్ రైల్వే ఓవర్ బ్రిడ్జి

ఆర్వోబీపై రయ్ రయ్

జహీరాబాద్‌లో ఎట్టకేలకు పూర్తయిన బ్రిడ్జి పనులు

జహీరాబాద్ పట్టణం నుంచి బీదర్ చౌరస్తాకు వెళ్లే దారి నిత్యం రాకపోకలతో రద్దీగా ఉంటుంది. కానీ, మధ్యలో ఉన్న రైల్వేగేట్ వాహనదారులకు అడ్డుకట్టగా మారింది. ఇది ఒక్కసారి పడిదంటే చాలు ఎంత సమయం అక్కడే వేచి ఉండాలో చెప్పడం కష్టం. ఎందుకంటే ఇది మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు వెళ్లే రైల్వే మార్గం. ప్రతీరోజు 35పైగా రైళ్ల రాకపోకలు సాగుతుంటాయి. ఒక్కోసారి ఈ గేటు వద్ద అరగంట దాకా వాహనాలు ఆగాల్సిందే. అంత సమయం వాహనదారులు ఓపికతో ఉండి వెళ్లక తప్పేది కాదు. ఇక ఈ సమస్యకు శాశ్వతంగా చెక్ పడనుంది. ఇక్కడ ఏడేళ్లుగా నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ) నిర్మాణం ఎట్టకేలకు పూర్తయింది. ప్రారంభించడమే తరువాయి..



ప్రారంభోత్సవానికి సిద్ధం
పట్టణంలో రైల్వే గేట్ సమస్యకు చెక్

జహీరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలో సుమారు రూ.90 కోట్లతో 2018లో ప్రారంభమైన రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ) పనులు పూర్తయ్యాయి. ఈ నెలాఖరులోపు ప్రారంభించే ఆలోచనలో ఉన్నట్లు అధికారుల వర్గాల ద్వారా తెలిసింది.

ఆర్వోబీతో శాశ్వత పరిష్కారం

రైల్వేగేటు ఉండడంతో జహీరాబాద్ పట్టణం నుంచి బీదర్ చౌరస్తా వైపు వెళ్లేందుకు చాలా కాలంగా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడి రైల్వే లైన్ మీదుగా నాందేడ్, షిర్డీ, లాతూర్, పూర్ణ, పర్లీ, బెంగుళూరు, తిరుపతి, కాకినాడ తదితర ప్రాంతాలకు ప్యాసింజర్, గూడ్స్ రైళ్లు 35 వరకు రాకపోకలు సాగిస్తాయి. రైళ్లు వెళ్తున్న సమయాల్లో 20-30 నిమిషాల మేర రైల్వే గేట్‌ను మూసేయాల్సి వచ్చేది. అయితే, బైపాస్ రోడ్డు అయ్యాక కొంత సమస్య తీరగ్గా, పట్టణం నుంచే బీదర్ చౌరస్తాకు వెళ్లే వారికి మాత్రం బైపాస్ దూరమయ్యేది. ఈ సమస్య తీరాలంటే ఆర్వోబీ ఒక్కటే దారి. ఎన్నో విజ్ఞప్తులు, నిరసనల తర్వాత ఆర్వోబీ వంతెన మంజూరైంది. పనులు ప్రారంభమైన నాటి నుంచి సకాలంలో బిల్లులు రాకపోవడం, తదితర కారణాలతో నత్తనడకన పనులు కొనసాగగా ఏడేళ్లకు పూర్తి అయింది. అయితే, ఎడ్లబజార్ సైడ్‌లో 100 మీటర్ల వెడల్పుతో భూసేకరణ చేపట్టాల్సి ఉందని, అదీ త్వరలోనే పూర్తిచేసి సర్వీస్ రోడ్డు పనులను చేపడతామని ఆర్అండ్‌బీ డీఈఈ శ్రీనివాస్, ఏఈఈ సంధ్య పేర్కొన్నారు. ఎడ్ల బజార్ మొదలుకుని బ్రిడ్జిని కలుపుతూ బీదర్ చౌరస్తా దారిలో కిలోమీటరు సెంటర్ లైటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. దీంతో ఇక రైల్వే గేట్ దారిలో వాహనాల రాకపోకల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్లయింది.

బ్రిడ్జి కిందకు మార్కెట్‌ను తరలించాలి

అర కిలోమీటరుకుపైగా ఉన్న బ్రిడ్జి కింద నుంచి రాకపోకలు తగ్గే అవకాశం ఉంది. బ్రిడ్జి కిందిభాగంలో కూరగాయల మార్కెట్ నిర్వహిస్తే బాగుంటుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న కూరగాయల మార్కెట్ ద్వారా అటు మార్కెటింగ్ శాఖకు, ఇటు మున్సిపాలిటీకీ ఎలాంటి ఆదాయం చేకూరడం లేదు. పట్టణం నడిబొడ్డున చెన్నారెడ్డినగర్ కాలనీకి వెళ్లే రోడ్డుపై ప్రతీ రోజు ఉదయం 5 గంటల నుంచి మొదలుకుని 11 గంటల వరకు రద్దీ ఉండడంతో కాలనీకి వెళ్లే వారికి ఇబ్బందులు తప్పడంలేదు. కూరగాయల మార్కెట్‌ను బ్రిడ్జి కిందకు తరలిస్తే అందరికీ మేలు జరుగుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

మామిడి రైతు కుదేలు



కాత లేని మామిడి చెట్లు

గణనీయంగా పడిపోయిన దిగుబడి
పతనమైన ధరలు.. రేటు లేక విలవిల

జోగిపేట, మే8 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత సీజన్‌లో వాతావరణ పరిస్థితులు, చీడ పీడల ఉధృతితో మామిడి దిగుబడి గణనీయంగా పడిపోయింది. అటు దిగుబడి లేక.. ఇటు మార్కెట్‌లోనూ సరైన రేటు రాకపోవడంతో మామిడి రైతు డీలా పడ్డాడు.

15 వేల ఎకరాల్లో..

సంగారెడ్డి జిల్లా పరిధిలో 15 వేల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. జహీరాబాద్ డివిజన్‌లోని కోహీర్, జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్ మండలాల్లోనే సుమారుగా 9 వేల ఎకరాల్లో తోటలు ఉండగా, ఆ తరువాత సంగారెడ్డి డివిజన్‌లోని సంగారెడ్డి, సదాశివపేట మండలాల్లో సుమారుగా 4 వేల ఎకరాల్లో, జోగిపేట డివిజన్ పరిధిలోని అందోలు, పుల్కల్, చౌటకూరు, హత్నూర మండలాల్లో 2 వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. జిల్లాలో ఎక్కువగా బంగినపల్లి, దశేరి, కేసర్, హిమాయత్, మల్లిక రకాల పండ్లను పండిస్తున్నారు. ఎకరాకూ 5 టన్నుల దిగుబడి అంచనా కాగా, 2.5 టన్నుల నుంచి 3 టన్నులకు మించి రావడం లేదు. మార్చి నెలాఖరు వరకూ పగలు ఎండ, రాత్రి చలి ఉన్న విపరీత వాతావరణంతో తేనెమంచు పురుగు, తదితర చీడలు ఆశించడంతో దిగుబడి అంతగా లేదు. ఇటీవల ఈదురుగాలులు, గాలివాన బీభత్సంతో మామిడి కాయలు నేలరాలాయి. దీంతో దిగుబడి మరింత పడిపోయింది. ప్రతీ సీజన్‌లో వస్తున్న దిగుబడితో పోల్చితే ఈసారి 30 శాతానికి మించి దిగుబడి లేదని ఉద్యానవనశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

రేటు అంతంతే!

మామిడి సీజన్ ప్రారంభమైన ఫిబ్రవరిలో టన్ను బంగినపల్లి రకం రూ.లక్షన్నరపైనే ధర పలికింది. అయితే క్రమేణ ధర పతనమవుతూ వచ్చింది. ప్రస్తుతం బంగినపల్లి రూ.60 వేల వరకు పలుకుతోంది. ప్రధానమైన మామిడి రకమైన దశేరి (రసాలు) రకం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. గతేడాది దశేరి టన్నుకు రూ. లక్షన్నర పలుకగా, ప్రస్తుతం రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు ఉంది. ఇక కేసర్ కూడా అంతే. ఎక్కువగా అమ్ముడయ్యే హిమాయత్ రకం గతేడాది టన్నుకు రూ.2.50 లక్షల నుంచి 2.80 లక్షల వరకు మార్కెట్‌లో ధర రాగా, ఈసారి రూ.లక్షన్నర నుంచి 2 లక్షల ధర పలుకుతోంది.

ప్రైవేటు మార్కెట్లే దిక్కు

ప్రస్తుత సీజన్‌లో మామిడి దిగుబడి పతనమవ్వడంతో ఏ రైతు జాతీయ మామిడి మార్కెట్‌కు కాయలను తరలించే పరిస్థితి లేదు. ప్రతి తోటలోనూ పట్టుమని పది టన్నులు కాయతెగే పరిస్థితి లేకపోవడంతో స్థానికంగా ఉన్న ప్రైవేట్ మార్కెట్లే దిక్కుగా మారాయి. జహీరాబాద్, సంగారెడ్డి, సదాశివపేట, జోగిపేట, హత్నూరలో స్థానిక మార్కెట్లు ఉన్నాయి. ఇక్కడ బంగినపల్లి ధర రూ.40 వేలకు మించడం లేదు. అన్ని రకాలకు మార్కెట్ ధర పడిపోయింది. వాస్తవానికి దిగుబడి తగ్గినప్పుడు ధర పెరగాలి. వాస్తవానికి ఇందుకు భిన్నంగా ఉంది. దళారులు కాయకు దెబ్బ తగిలింది, సైజు చిన్నగా ఉంది అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతూ తక్కువ ధరను ఇస్తున్నారు. అసలే దిగుబడివ తగ్గడం ఆపై గాలికి కాయలు రాలడంతో ఆందోళనలో ఉన్న రైతు ఏధరకైనా అమ్ముకుందామనే ఆలోచనలో ఉండడంతో దళారులు ఇది గమనించి అందిన కాడికి దండుకుంటున్నారు. దీంతో మామిడి తోటలను కౌలుకు తీసుకున్న వారి సంగతి మరీ దారుణంగా మారింది.



కౌలు కూడా వచ్చేట్టు లేదు



ఈయేడు దిగుబడి తగ్గడంతోపాటు బహిరంగ మార్కెట్లో మామిడి పండ్లకు ధర లేపోవడంతో మాకు గిట్టుబాటయ్యే పరిస్థితి లేదు. లాభం అటుంచి, కనీసం మేము.. తోట యజమాని వద్ద తీసుకున్న కౌలు కూడా మాకు తిరిగివచ్చే పరిస్థితి కనిపించడంలేదు. ఆశపెట్టుకున్న పంటపై అప్పులే మిగిలే పరిస్థితి ఉన్నది.

- నక్కపోతుల సంధ్య, కౌలు రైతు

ప్రభుత్వం ఆదుకోవాలి



ఈదురుగాలులు, చీడపీడలు మామిడి దిగుబడిని దెబ్బతీశాయి. దిగుమతి తగ్గినప్పుడు పెరగాల్సిన రేటు పెరగకపోగా మరింత తగ్గుతోంది. పండ్లు, కూరగాయలు సాగు చేస్తున్న రైతులకు అనువైన మార్కెట్, గిట్టుబాటు ధరలను కల్పించేలా ప్రభుత్వం ఆలోచన చేయాలి. లేదంటే ఉద్యానవన రైతులు బతికిబట్టకట్ట లేరు. ఈదురుగాలులకు మామిడికాయలు రాలి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- బాలకృష్ణారెడ్డి, రైతు

వాతావరణ మార్పే తక్కువ దిగుబడికి కారణం



నాలుగేళ్లుగా వాతావరణంలో సంభవిస్తున్న విపరీత మార్పులే మామిడి దిగుబడికి ప్రధాన కారణం. అసాధారణ వాతావరణంతో చీడపీడలు వృద్ధి చెంది దిగుబడి తగ్గుతోంది. పంట కోతకు వచ్చే సమయంలో వీస్తున్న గాలిదుమారం కూడా మరో కారణం.

-సమతారెడ్డి, ఉద్యానవన అధికారి

నెలరోజుల్లో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలి

- నీటి సమస్య తలెత్తకుండా చూడండి
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నెలరోజుల్లో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేయాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మిషన్ భగీరథ, విద్యా, వైద్యారోగ్య, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి టాయిటెట్లు నిర్మించాలన్నారు. గురుకుల పాఠశాల, కళాశాలల్లో తాగునీటి ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. గురుకుల విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలకు మిషన్ భగీరథ నీరు తప్పనిసరిగా సరఫరా చేయాలని ఆదేశించారు. అధికారులు పాఠశాలలకు వచ్చినప్పుడు ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అందుబాటులో ఉండాలన్నారు. పంచాయతీ భవనాలు లేని గ్రామాల్లో నిర్మించాలని, అదేవిధంగా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు నిర్మించాలన్నారు. అధికారులు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి తనిఖీ చేయాలని, సీడీపీవోలు సూపర్వైజర్లతో సమీక్ష నిర్వహించాలని కలెక్టర్ క్రాంతి సూచించారు. గ్రామాల్లో సీసీ రోడ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జడ్పీసీఈవో జానకిరెడ్డి, డీపీవో సాయిబాబ, డీఆర్డీఏ పీడీ జ్యోతి, డీఎంహెచ్‌వో గాయత్రి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

చిలప్‌చెడ్, మే 8(ఆంధ్రజ్యోతి) : రైతులు ప్రభుత్వం నిర్వహించే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. మండలం పరిధిలోని గంగారం గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు ఇచ్చిన దరఖాస్తులను ఆయన పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తమ భూరికార్డుల్లో ఉన్న పేరు తప్పులు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వం భూములు, భూస్వభావం తప్పులు, ప్రభుత్వ భూములు నవీకరించడం, సాదాబైనామా కేసులు, భూసేకరణ కేసులు తదితర భూసమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించి భూభారతి కొత్త ఆర్వోఆర్ చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపడతారని తెలిపారు. నిర్దేశిత గడువులోగా పరిష్కారం చూపుతారని పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వం నిర్వహించే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట తహసీల్దార్ సహదేవ్, డీటీ సింధూజా రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

బార్డర్‌లో మనోళ్లు

ఐదో పేజీ తరువాయి

బార్డర్ల వైపు పరుగెడుతాయి. 1,104 కుటుంబాలు ఉన్న ఈ గ్రామంలో 120 మంది సైనికులు ఉన్నారంటేనే అతిశయోక్తి కాదు. ఇక్కడి నుంచి సైనికులు వీరమరణం పొందినప్పటికీ మిగితా వారు వెనుకడుగు వేయకుండా దేశసేవకు ముందుకెళ్లడం విశేషం. ప్రస్తుతం జరిగిన ఆపరేషన్ సింధూర్‌తోపాటు యుద్ధానికి సిద్ధమైన ప్రాంతాల్లో 25 మంది సైనికులున్నారు. మిగతావారు ఇతర రాష్ట్రాల్లోని రెజిమెంట్లలో విధులు నిర్వహిస్తున్నారు. కాగా యుద్ధ వాతావరణం నెలకొన్న ఈ సమయంలో వారి కుటుంబాల్లో ఒకింత ఆందోళన చెందుతున్నప్పటికీ.. తమ బిడ్డలకు ధైర్యం చెప్పడం తల్లిదండ్రుల గొప్పతనం.

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

- రానున్న రోజుల్లో అమలులోకి కొత్త విత్తన చట్టం
- రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యురాలు భవానీరెడ్డి



మాట్లాడుతున్న భవానీరెడ్డి

తొగుట, మే 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యురాలు భవానీరెడ్డి రైతులకు సూచించారు. గురువారం తొగుట మండలం గుడికందుల గ్రామంలోని రైతువేదికలో జిల్లా వ్యవసాయ శాఖ, తోర్నాల ఏరువాక వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.శ్రీదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు అనే కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న రోజుల్లో కొత్త విత్తన చట్టం అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. సాగు వ్యయం తగ్గించుకుని మంచి దిగుబడులు సాధించాలని సూచించారు. మహిళా రైతులకు విలువ ఆధారిత ఉత్పత్తులు, డీహైడ్రేటెడ్ ఉత్పత్తుల ద్వారా మంచి ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అలాంటి రైతులకు రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ తరఫున అండగా ఉంటామని తెలిపారు. అనంతరం తోర్నాల ఏరువాక వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి మాట్లాడారు. వ్యవసాయానికి సంబంధించి రైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు. యూరియా వాడకాన్ని తగ్గించి, రసాయన ఎరువులను అవసరం మేరకే వాడి నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. ఖరీఫ్‌లో విత్తనాలు కొన్నప్పుడు రసీదును పొంది భద్రపరుచుకోవాలన్నారు. పంటల్లో సాగునీటి ఆదా, ప్రత్యామ్నాయ పంటల వివరాలు, చెట్ల పెంపకం లాంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మోహన్, తొగుట రైతు ఉత్పత్తిదారుల సంఘం సీఈవో తిరుపతి, శాస్త్రవేత్తలు రమాదేవి, ఉమారాణి, ఏఈవోలు దేవేందర్, సాయికుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రజని, వెలుగు గ్రామైఖ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.



జాతీయ రహదారి నుంచి కానుకుంట గ్రామానికి వెళ్లే రహదారిపై కనిపించని బోర్డు



గుమ్మడిదల గ్రామం నుంచి నాగిరెడ్డి గూడెం వెళ్లే దారిలో లేని సూచిక బోర్డు

ఏ దారి ఎటు వెళ్తుందో!

గుమ్మడిదల మండలంలో కనిపించని సూచిక బోర్డులు
గ్రామాలకు వెళ్లే దారుల్లో వాహనదారుల తికమక
పట్టించుకోని సంబంధిత శాఖల అధికారులు

గుమ్మడిదల, మే 8 (ఆంధ్రజ్యోతి) : నగరానికి అతిచేరుకులో ఉన్న మండలం గుమ్మడిదల. వేగంగా అభివృద్ధి చెందుతున్న మండలంలో రాకపోకలు పెరిగిపోతున్నాయి. అయితే, మండలంలో వివిధ గ్రామాలకు వెళ్లే దారుల్లో సూచిక బోర్డులు లేక వాహనదారులు ఎటు వెళ్లాలో తెలియక తికమకపడుతున్నారు. బోర్డులను ఏర్పాటు చేయడంలో సంబంధిత శాఖలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి.

మెదక్ జాతీయ రహదారిపై నుంచి వెళ్లే కొత్తపల్లి - నల్లవల్లి వెళ్లే దారి, జాతీయ రహదారి నుంచి మంబాపూర్ వెళ్లే రోడ్డు, మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారి నుంచి కానుకుంటకు వెళ్లే రోడ్డు, గుమ్మడిదల నుంచి నాగిరెడ్డిగూడెం వెళ్లే రోడ్డు, మేడ్చల్ కానుకుంట రహదారి నుంచి అనంతారం గ్రామానికి వెళ్లే దారిలో గ్రామం, కిలోమీటర్లు చూపే సూచిక బోర్డులు లేవు. ఇటీవల మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకెళ్తుండగా, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు పెరిగిపోయారు. ఇక్కడికి వాహనలపై వచ్చే వారు ఆగి మరీ స్థానికులను అడిగి తెలుసుకుని గ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. కొందరైతే సరైన మార్గం తెలియక ఎక్కువ దూరం ప్రయాణం సాగించి, తిరిగి వెనక్కి రావల్సిన పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో గుమ్మడిదల మండలంలో పలు గ్రామాలకు వెళ్లే దారుల వద్ద ఆయా గ్రామాల పేర్లు, వాటి దూరాలను తెలిపే బోర్డులను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



మేడ్చల్- కానుకుంట రహదారి నుంచి అనంతారం గ్రామానికి వెళ్లే రోడ్డులో కనిపించని సూచిక బోర్డు

స్థిర వ్యవసాయ పద్ధతుల మెరుగుకు డ్రోన్ సాంకేతికత

ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి దండా రాజిరెడ్డి



ఒప్పంద పత్రాలతో కళాశాల, కంపెనీ ప్రతినిధులు

ములుగు, మే 8 (ఆంధ్రజ్యోతి): స్థిరమైన వ్యవసాయ పద్ధతులను డ్రోన్ ఆధారిత సాంకేతికతతో మెరుగుపర్చడమే లక్ష్యమని శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి దండా రాజిరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన మారుత్ డ్రోన్స్ కంపెనీతో ఉద్యాన యూనివర్సిటీ గురువారం సాంకేతిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ డ్రోన్ ఆధారిత సాంకేతికను ఉపయోగించి పంట పర్యవేక్షణ, తెగులు, వ్యాధుల అంచనాను తెలుసుకోవచ్చన్నారు. ఈ ఒప్పందం ద్వారా ఆరు ప్రధాన ఉద్యాన పంటలైన మిరప, పసుపు, టమోటా, వంకాయ, ఆయిల్‌పామ్, మామిడి పంటల్లో పరిశోధనలను చేపట్టనున్నామని తెలిపారు. వ్యవసాయంలో సాంకేతిక అభివృద్ధిపై సంయుక్తంగా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్, మారుత్ డ్రోన్ కో ఫౌండర్ ప్రేమ్‌కుమార్, డీన్ ఆఫ్ హార్టికల్చర్, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ చీనానాయక్, పలు విభాగాల ప్రొఫెసర్లు, యూనివర్సిటీ సిబ్బంది కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళ హత్య

గజ్వేల్, మే 8 (ఆంధ్రజ్యోతి): మహిళ గొంతునులిమి గుర్తు తెలియని వ్యక్తులు హత్యకు పాల్పడిన ఘటన గజ్వేల్ పట్టణంలో గురువారం సాయంత్రం చోటచేసుకున్నది. గజ్వేల్ పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన గడియారం బాలమణి(64) భర్త కొన్నేళ్ల క్రితం మరణించగా, తన చిన్న కుమారుడితో కలసి ఉంటుంది. ఈ క్రమంలో గురువారం ఇంట్లో బాలమణి మాత్రమే ఉండగా, గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి గొంతునులిమి చంపినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ విషయంపై ఘటనాస్థలానికి చేరుకున్న సీఐ సైదా వివరాలను సేకరించారు.

రాయపోల్ కేజీబీవీలో ఒకేషనల్ కోర్సులు

రాయపోల్, మే 8 (ఆంధ్రజ్యోతి): రాయపోల్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సులు మంజూరయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కేజీబీవీ ప్రిన్సిపాల్ సుగంధలత తెలిపారు. 2025-2026విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ ఒకేషనల్ విభాగంలో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్(ఎంపీహెచ్‌డబ్ల్యూ), మెడికల్ ల్యాబోరేటరీ టెక్నాలజీ(ఎంఎల్‌టీ) కోర్సులు ప్రారంభం కానున్నాయి. ఒక్కో కోర్సులో 40 మంది విద్యార్థులను చేర్చుకునే అవకాశం ఉన్నది. ఆసక్తి కలిగిన విద్యార్థులు కేజీబీవీ పాఠశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

ఉమ్మడి మెదక్ డీసీసీబీకి ఉత్తమ అవార్డు



డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డికి అవార్డు అందజేస్తున్న మంత్రి సీతక్క

కొండపాక, మే 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ డీసీసీబీకి బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డు దక్కింది. ఈ మేరకు గురువారం హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డికి మంత్రి సీతక్క అవార్డును ప్రదానం చేశారు. 2004-25 సంవత్సరంలో సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు లింకేజీ ప్రోగ్రాంలో ఎక్కువ శాతం రుణాలు అందించి వారి అభ్యున్నతి కృషి చేసినందుకు ఈ అవార్డు దక్కింది.

బీఆర్ఎస్ హయాంలోనే ప్రజలకు న్యాయం

● జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



చేర్యాలలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

చేర్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ హయాంలోనే ప్రజలకు అన్నివిధాలా న్యాయం చేకూరిందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. చేర్యాల పట్టణం, రూరల్, కొమురవెల్లి మండలాలకు చెందిన లబ్ధిదారులకు గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలందరికీ పారదర్శకంగా సీఎంఆర్ఎఫ్ అందించిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కోత పెడుతుందన్నారు. అనంతరం ఇటీవల రోడ్డుప్రమాదంలో గాయాలపాలైన ఏడో వార్డుకు చెందిన పోగుల శ్రీకాంత్‌ను పరామర్శించారు.

హమాలీల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాల్‌స్వామి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాల స్వామి

సిద్దిపేటరూరల్, మే 8(ఆంధ్రజ్యోతి) : హమాలీల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు కూలి రేట్లు ప్రభుత్వమే నేరుగా చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి అన్నారు. గురువారం సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో హమాలీ కార్మికులు ఏఐటీయూసీని వీడీ సీఐటీయూలో చేరారు. వారికి ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపాల స్వామి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతి హమాలీకి రూ.10వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. అన్ని రకాల హమాలీలకు గుర్తింపు కార్డులు, రెండు జతల యూనిఫాం, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, హమాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు కనకయ్య, మాదం మల్లేశం, రాజయ్య, ఎల్లయ్య, కనకయ్య, మల్లేశం, రామచంద్రం, ఐలయ్య, శ్రీనివాసు, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ పనులు నిలిపి వేయాలని ఉత్తర్వులు

బెజ్జంకి, మే 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుగ్గిళ్ల గ్రామ శివారులో నిర్మిస్తున్న గ్రీన్ వేస్ బయో ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ (ఈథనాల్) ఫ్యాక్టరీ పనులను నిలిపి వేయాలని సిద్దిపేట జిల్లా కోర్టు ఉత్తర్వులు ఇచ్చినట్లు ఆ గ్రామ పరిరక్షణ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఫ్యాక్టరీ నిర్మాణ అనుమతుల కోసం గ్రామస్థులకు తెలియకుండా గత గ్రామ పంచాయతీ పాలక వర్గ సభ్యులు దొంగచాటుగా తీర్మానం చేశారని ఆరోపించారు. ఫ్యాక్టరీతో భవిష్యత్‌లో పంట పొలాలు దెబ్బతినడంతో పాటు, ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థ జలాలతో భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాద ఉందని వాపోయారు. దీనిపై రెండేళ్లుగా పోరాటాలు చేస్తున్నామన్నారు. జిల్లా కోర్టులో కేసు వేయగా ఫ్యాక్టరీ నిర్మాణ పనులు, ఉత్పత్తులను (ఈథనాల్) జూన్ 10 వరకు నిలిపి వేయాలని జిల్లా జడ్జి సాయి రమాదేవి ఉత్తర్వులు ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ మేరకు ఫ్యాక్టరీ యజమాన్యం గౌరవించి పనులను ఆపాలని కోరారు.

ప్రమాదకరంగా..



మిరుదొడ్డి,మే8(ఆంధ్రజ్యోతి):ప్రజల ప్రాణాలంటే అధికారులకు కూడా పట్టింపులేదు. నిత్యం ఆసుపత్రికి వచ్చే రోగులు, ప్రజలకు తీవ్ర భయంతో వెళ్లతున్నారు. మిరుదొడ్డి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ఈవిషయం తెలిసిన కూడా విద్యుత్తు శాఖ అధికారులకు చలనం లేకుండా పోతుంది. గతంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పాడిగెదే కూడా విద్యుత్తుషాక్‌కు గురై మృతిచెందింది. ఆసుపత్రివద్ద ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ముల్లెకంచెను ఏర్పాటు చేసి ప్రజలకు, మూగజీవాలకు ప్రమాదం వాటిల్లకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా మంత్రి పొన్నం జన్మదిన వేడుకలు

● శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత



హుస్నాబాద్‌లో రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్/ధూళిమిట్ట/హుస్నాబాద్‌రూరల్/చిన్నకోడూరు/కొండపాక/చేర్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలను గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. హుస్నాబాద్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి కేక్‌ను కట్ చేశారు. పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ, పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ నాయకులు మంత్రిని గజమాలతో సన్మానించారు. యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సందర్శించి వారికి పండ్లు అందించారు. పట్టణంలోని అక్కన్నపేట చౌరస్తాలో యూత్ కాంగ్రెస్ నాయకులు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు అక్కు శ్రీనివాస్ వ్యక్తిగతంగా 58 మంది పార్టీ నాయకులకు రూ.10 లక్షల ప్రమాద బీమా పాలసీని చెల్లించి వాటి ధృవీకరణ పత్రాలను అందించారు. అలాగే సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పొన్నం ప్రభాకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హుస్నాబాద్ కల్లుగీత కార్మికులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తాటి ముంజలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చిన్నకోడూరు మండలం చెర్లఅంకిరెడ్డిపల్లిలో ఉపాధిహామీ కూలీలకు సిద్దిపేట నియోజక వర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అజ్జు యాదవ్, కాంగ్రెస్ నేతలతో కలిసి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కొండపాక మండలం వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద కాంగ్రెస్ నేతలు జన్మదిన వేడుకలు నిర్వహించారు. చేర్యాలలో మాజీ జడ్పీటీసీ నర్సింగరావు ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి మిఠాయిలు పంపిణీ చేశారు.

సాయం చేస్తుండగా కబళించిన మృత్యువు

● టైరు మార్చుతుండగా కారు ఢీకొని వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో మనోజ్‌కుమార్ మృతదేహం

రాజేంద్రనగర్, మే 8(ఆంధ్రజ్యోతి) : సాటి మనిషికి సాయం చేద్దామనుకున్న వ్యక్తిని మృత్యువు కబళించింది. వివరాలు ఇలా ఉన్నాయి. చెంచల్‌గూడకు చెందిన అజంఅలీ, అతని భార్య షిఫా, తమ్ముడు గౌస్, రెండు నెలల పాపతో కలిసి మహారాష్ట్రలోని లాతూర్‌లో జరిగిన శుభకార్యానికి వెళ్లి బుధవారం రాత్రి తిరిగి వస్తున్నారు. 2:30 గంటలకు అజం అలీ ఇన్నోవా కారు రాజేంద్రనగర్ పరిధిలోని హిమాయత్‌సాగర్ ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ 17 వద్ద టైరు పగిలిపోయింది. దీంతో వారు కారు దిగి సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. వారి వెనుకాలే ఓ షిఫ్ట్ కారులో వస్తున్నవారు ఇన్నోవాను చూసి దాని వెనుకాలే ఆపి సాయం చేసేందుకు చూస్తున్నారు. అదే సమయంలో రికవరీ వ్యాన్ నడిపే సిద్దిపేట్ జిల్లా రుద్రారంకు చెందిన బొయిన మనోజ్ కుమార్(25) కర్నూల్ నుంచి వాహనాన్ని తీసుకువస్తున్నాడు. ఆగి ఉన్న కార్లను గమనించి రోడ్డు అవతలి వైపే తన వాహనాన్ని ఆపి అక్కడికి వచ్చి సమస్యను తెలుసుకున్నాడు. దీంతో తన వద్ద ఉన్న జాక్ తీసుకువచ్చి ఇన్నోవా టైరు మార్చడానికి ప్రయత్నిస్తున్నాడు. అప్పుడే గచ్చిబౌలి వైపు నుంచి హిమాయత్‌సాగర్ వైపు కారులో వేగంగా వచ్చిన షేక్ మోహిద్ ఆగి ఉన్న షిఫ్ట్, ఇన్నోవా కార్లను బలంగా ఢీ కొట్టాడు. ఈ ఘటనలో కారు టైర్ అమర్చుతున్న మనోజ్ కుమార్ అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకుని మనోజ్‌కుమార్ మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును, షేక్ మోహిద్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఎస్ఐ భాను ప్రకాశ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మహోత్సవాలకు ముస్తాబు

ములుగు, మే 8 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలం మామిడ్యాల గ్రామ సమీపంలో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయం ఉత్సవాలకు ముస్తాబైంది. శుక్రవారం నుంచి వేడుకలు ప్రారంభం కానున్నాయి. మొదటిరోజు ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన గోపుర కలశ ప్రతిష్ఠ మహోత్సవం, అనంతరం ఆవాహన పూజ, అగ్ని ప్రతిష్ఠ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం అభిషేకం, పూర్ణాహుతి మార్జనం కార్యక్రమాలతో రుత్విక్ సన్మానం నిర్వహిస్తారు. భక్తులు హాజరై స్వామివారి కృపకు ప్రీతిపాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

సిద్దిపేట ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు

● యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ బి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న రీజనల్ హెడ్ బి. శ్రీనివాస్

సిద్దిపేట కలెక్టరేట్, మే 8 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు నివ్వడంతోపాటు వ్యవసాయ రంగానికి మద్దతిస్తున్నట్లు యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ బి. శ్రీనివాస్ తెలిపారు. గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఆ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో వ్యవసాయ అభివృద్ధి పథకాలు, నాబార్డ్ సబ్సిడీ వివరాలపై డీఈవో రాధిక డీడీఎం నాబార్డ్ నిఖిల్ రెడ్డి, ఎల్డీఎం హరిబాబులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. క్రమం తప్పకుండా రుణాలను చెల్లించడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

'విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలి'

మద్దూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉన్నత లక్ష్యం కోసం కష్టపడి చదువుకుని గొప్ప భవిష్యత్తును నిర్మించుకోవాలని ఎంఈవో వరదరాజు సూచించారు. గురువారం మండలంలోని రేబర్తి ఉన్నత పాఠశాల నుంచి కర్ణాటక రాష్ట్రంలో ఎప్రిల్ 30 నుంచి మే 4 వరకు జరిగిన జరిగిన సబ్ జూనియర్స్ గర్ల్స్ జాతీయ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొన్న పాఠశాల విద్యార్థిని చేవెళ్ల వైష్ణవిని అభినంఇంచారు. అదేవిధఃగా పదవ తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో విద్యాభ్యాసాన్ని కొనసాగించి జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రభాను, చంద్రారెడ్డి, రవి, మల్లేశం, నర్సింహులు, శ్రీనివాస్‌రెడ్డి, రఫత్ పాల్గొన్నారు.



వైష్ణవిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆపరేషన్ సిందూర్‌ను స్వాగతించాల్సిందే

● బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌ను ప్రతి ఒక్కరూ స్వాగతించాల్సిందేనని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 28 మంది అమాయక ప్రజలను పొట్టన పెట్టుకున్న పాక్ ఉగ్రవాదులకు గట్టిగా బుద్ధి చెప్పాలని, దేశ ఐక్యత, సమగ్రతకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలన్నారు. ప్రధాని మోదీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను అభినందించిన ఆయన పాక్ ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు దేశ రక్షణ దళాలు చేపడుతున్న మెరుపు దాడులు ప్రశంసనీయమని కొనియాడారు. అదును చూసి పాక్‌ను దెబ్బకొట్టిన ప్రధాని నరేంద్రమోదీ ఎత్తుగడల ముందు పాక్ సైన్యం, ఉగ్రమూకలు చిత్తు అయ్యారని ప్రశంసించారు. ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయాలకు అతీతంగా త్రివిధ దళాలకు, కేంద్ర ప్రభుత్వానికి మద్దతు పలకాలని పిలుపునిచ్చారు.

ఫ్యాక్టరీ పనులు నిలిపి వేయాలని ఉత్తర్వులు

బెజ్జంకి, మే 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుగ్గిళ్ల గ్రామ శివారులో నిర్మిస్తున్న గ్రీన్ వేస్ బయో ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ (ఈథనాల్) ఫ్యాక్టరీ పనులను నిలిపి వేయాలని సిద్దిపేట జిల్లా కోర్టు ఉత్తర్వులు ఇచ్చినట్లు ఆ గ్రామ పరిరక్షణ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఫ్యాక్టరీ నిర్మాణ అనుమతుల కోసం గ్రామస్థులకు తెలియకుండా గత గ్రామ పంచాయతీ పాలక వర్గ సభ్యులు దొంగచాటుగా తీర్మానం చేశారని ఆరోపించారు. ఫ్యాక్టరీతో భవిష్యత్‌లో పంట పొలాలు దెబ్బతినడంతో పాటు, ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థ జలాలతో భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాద ఉందని వాపోయారు. దీనిపై రెండేళ్లుగా పోరాటాలు చేస్తున్నామన్నారు. జిల్లా కోర్టులో కేసు వేయగా ఫ్యాక్టరీ నిర్మాణ పనులు, ఉత్పత్తులను (ఈథనాల్) జూన్ 10 వరకు నిలిపి వేయాలని జిల్లా జడ్జి సాయి రమాదేవి ఉత్తర్వులు ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ మేరకు ఫ్యాక్టరీ యజమాన్యం గౌరవించి పనులను ఆపాలని కోరారు.

ఎస్టీపీ వర్క్‌షాప్‌లో కమిషనర్

గజ్వేల్, మే 8(ఆంధ్రజ్యోతి): సీడీఎంఏ కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్లకు ఎస్టీపీలపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య పాల్గొన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ ఎస్టీపీకి త్రీ స్టార్ రేటింగ్ ఇచ్చినట్లు కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా కోకాపేటలోని ఎస్టీపీని సందర్శించి, నీటి శుద్ధీకరణపై అవగాహన కల్పించారు. ఆయనతో పాటు మునిసిపల్ ఏఈ మహేశ్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీకి పాముకాటు

ధూళిమిట్ట, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్యానాయక్ తండాలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీ ధరావత్ హన్మంతును గురువారం పాము కాటు వేసింది. గమనించిన కూలీలు 108లో చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందించిన వైద్యులు ప్రమాదం ఏమిలేదనీ తెలిపారు. బాధితుడిని ఎంపీడీవో రాంమోహన్, ఉపాధిహామీ ఈసీ పరామర్శించారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి సీపీఐ కృషి

చేర్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారానికి సీపీఐ కృషి చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గసభ్యుడు అందె అశోక్ అన్నారు. చేర్యాల మండలం చుంచనకోట గ్రామంలో గురువారం నిర్వహించిన సీపీఐ గ్రామ మహాసభలో ఆయన మాట్లాడారు. రైతాంగ సాయుధ పోరాటం, తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక వహించిన సీపీఐ అనునిత్యం ప్రజలమధ్యన ఉంటు సమస్యల పరిష్కారానికి పాటుపడుతుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ సత్తా చాటేందుకు కార్యకర్తలు సంసిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నాయకలు కామల్ల అయిలయ్య, ఇమ్మడి శ్రీనివాస్, పుల్ల కుమార్, బింగి అయిలు మల్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని వినతి

చేర్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలో ప్రభుత్వ గుర్తింపు, అనుమతిలేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న శ్రీచైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం ఏఐఎస్ఎఫ్ నాయకులు స్థానిక ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి షేక్ యాసిన్ మాట్లాడుతూ శ్రీ చైతన్య ముసుగులో గత శుభోదయ పాఠశాలను కొనసాగిస్తూ వేలాది రూపాయల ఫీజు వసూలుతో దోపిడికి పాల్పడుతున్నారన్నారు. వెంటనే విద్యాశాఖాధికారులు స్పందించి పాఠశాలపై చర్యలు తీసుకోవాలని, లేనియెడల ఆందోళనలు కొనసాగిస్తామన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

మర్కుక్, మే 8 (ఆంధ్రజ్యోతి): వరదరాజపూర్‌లోని భూనీల సమేత వరదరాజ స్వామి పునర్నిర్మాణానికి బీఆర్ఎస్ మర్కుక్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి విరాళం అందజేశారు. రూ21 వేలను ఆలయ ట్రస్ట్ చైర్మన్ గోపాలకృష్ణకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిలో తాను కూడా భాగస్వామ్యం కావడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్కాకుల నరేష్, నర్సింహులు, తదితరులు ఉన్నారు.



విరాళం అందజేస్తున్న కరుణాకర్‌రెడ్డి

కాల్చితే.. నష్టమే..!

● వరి కొయ్యల కాల్చివేతతో అనర్థాలు

● భూసారం దెబ్బతిని పంట దిగుబడిపై ప్రభావం



చిన్నకోడూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : వరి కోతల తర్వాత మిగిలిన మొదళ్లకు అవగాహన లేక రైతులు నిప్పు పెట్టి తొలగిస్తున్నారు. భూమిని సులువుగా సాగుకు సిద్ధం చేసుకోవచ్చని అన్నదాతలు ఇలా చేస్తున్నారు. కానీ దీంతో వాయు కాలుష్యం ఏర్పడటంతో పాటు, భూసారం తగ్గడం, భూమి తన స్వభావాన్ని కోల్పోవడం జరుగుతుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. ఇది పంట దిగుబడి పై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందంటున్నారు. ప్రస్తుతం వర్షాకాలం సీజన్‌లో వరి సాగుకు సిద్ధమవుతున్న రైతులు పొలాల్లో మిగిలిపోయిన వరి కొయ్యలను సులభంగా తొలగించేందుకు కాల్చి వేస్తున్నారు. దీనితో భూసారం దెబ్బతినే ప్రమాదం ఉందని అధికారులు చెబుతున్నారు.

కలియ దున్నితే ప్రయోజనం...

గతంలో యంత్రాలు అందుబాటులో లేనప్పుడు రైతులు కూలీలతో వరి పంటలు కోయించేవారు. కూలీలు వరి పైరును పూర్తిగా కింది వరకు కోసేవారు. మిగిలి పోయిన వాటిని భూమిలోనే కలియ దున్ని మళ్లీ సాగు చేసేవారు. కొయ్యలు కుళ్లిపోయి, ఎరువుగా మారి భూసారం పెరిగేందుకు ఉపయోగపడేది. వరి కోత యంత్రాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. యంత్రాలు వరి కొయ్యలన పై పైన కోయడంతో మిగిలిన వాటిని రైతులు నిప్పంటించి కాల్చి వేస్తున్నారు. దీనితో భూమిలోని పంటలకు మేలు చేసే కీటకాలు, సూక్ష్మజీవులు మృతి చెందుతున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. నిప్పు పెట్టడం వల్ల సమీపంలో పశువుల మేత కోసం నిల్వ చేసిన గడ్డి వాములు, పైపులు దగ్ధమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా దట్టమైన పొగ గాలిలో కలిసి వాయు కాలుష్యం ఏర్పడుతుందని చెబుతున్నారు. ఈ తరుణంలో వరి కొయ్యలను భూమిలో కలియ దున్నితే కలిగే లాభాలపై వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అవగాహన కల్పిస్తున్నాం

వరి కొయ్యలను కాల్చ కూడదని గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. వరి కొయ్యలను కాల్చడం ద్వారా భూసారం దెబ్బ తినడంతో పాటు, వేడిమికి పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు చనిపోతాయి. పర్యావరణం కూడ దెబ్బ తింటుంది. కోతల తర్వాత మిగిలిన వరి కొయ్యలను భూమిలోనే కలియదున్నితే సేంద్రియ ఎరువుగా మారుతుంది. దీంతో పంట దిగుబడి పెరుగుతుంది.

-జయంత్ కుమార్, ఏవో

పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

చేర్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో గురువారం ఉత్తర నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని విశేషంగా అలంకరించి అభిషేకాలు, హోమం నిర్వహించారు. హాజరైన భక్తులు అయ్యప్ప స్వామి శరణుఘోష, భజనలతో ఆలయ పరిసరాలు ప్రతిధ్వనించాయి.



చేర్యాల అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

● మర్కుక్, మే 8 (ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా వరదరాజ స్వామి దేవాలయ పునర్నిర్మాణ వైభవంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం దేవతామూర్తుల, శిఖర, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించారు. భూనీల సమేత వరద స్వామి కల్యాణాన్ని కనుల పండుగగా నిర్వహించారు. ఆలయ వంశం పారంపర్య ప్రధాన ధర్మకర్త గోపాలకృష్ణ ఉత్సవాలను పర్యవేక్షించారు.

● చేర్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి) : భగవన్నామ సంకీర్తన సంఘం, హనుమాన్ మాలాధారణస్వాములు గురువారం చేర్యాల పట్టణంలో ఏకాదశ నగర సంకీర్తన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ, హనుమాన్ నామస్మరణతో పట్టణంలోని ప్రధానవీధులగుండా ర్యాలీ చేపట్టారు. అనంతరం వేణుగోపాలస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు.

● నంగునూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): నంగునూరు మండలం దేవుని నర్మెట గ్రామంలో శ్రీ లక్ష్మణ సమేత సీతారామ చంద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రాళ్ల బండి వెంకట రమణాచారి, కమిటీ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో కల్యాణం జరిగింది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.